సాక్షి నంద్యాల

సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025



అత్యవసర వైద్యానికి 'డ్రోన్' హారన్

ట్రిపుల్ ఐటీడీఎం ప్రొఫెసర్లు డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ అనే సరికొత్త వ్యవస్థను రూపొందించారు. ఈ విధానంతో అత్యవసర సమయంలో వైద్యం అందించవచ్చు. 8లో▸



ఫిజియో థెరపీ.. అంతా హ్యాపీ

వైద్యులు శస్త్రచికిత్సలు చేసినా మళ్లీ సాధారణ జీవితం గడపాలంటే ఫిజియో థెరపీ కొన్ని రోజులు చేయాలి. ఇబ్బందుల నుంచి ఇది ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 79.798
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 42,064
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 41,553

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లా కేంద్రంతో పాటు డివిజన్ కేంద్రాలు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా "meekoram.ap.gov.in" లో ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్‌లైన్‌లో తెలుస్తుందని, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధికారులు తప్పకుండా హాజరుకావాలన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

కోవెలకుంట్ల: అవుకు, సంజామల మండలాల్లో ఆదివారం పిచ్చికుక్క స్వైర్వ విహారం చేయడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. అవుకు మండలం కాశీపురం, సుంకేసులకు చెందిన శాంతయ్య, కళావతి, జగదీష్‌రెడ్డి, బుల్లబ్బాయి, సంజామల మండలం ఆకుమల్లకు చెందిన దస్తగిరిపై పిచ్చికుక్క దాడి చేసి కరిచింది. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పిచ్చికుక్కను ఆకుమల్ల గ్రామస్తులు వెంటాడి చంపేశారు.

13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): మునినాగలక్ష్మి జ్ఞాపకార్థం ఈనెల 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్రా చెస్ అసోసియేషన్, జిల్లా చెస్ సంఘం, ఎస్ఆర్‌జీ చెస్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు రవికృష్ణ, రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ డైరెక్టర్ రాజేష్ ఆదివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వివేకానంద ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి ర్యాపిడ్ అండ్ బ్లిడ్స్ వేర్వేరు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తామన్నారు. ఈనెల 9వ తేదీ సాయంత్రంలోగా ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 9010451585ను సంప్రదించాలన్నారు.

హామీలు తూచ్!

- గుండాల రిజర్వాయర్‌ను నిర్మించలేదు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజలు కష్టంలో ఉన్నారు.. వారిని ఆదుకుంటామని.. పేదలను ధనవంతులను చేస్తామని.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు నారా లోకేష్ ఎన్నో హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం మరిచారు. ఇప్పటి వరకు జలదుర్గాన్ని మండలంగా ప్రకటించలేదు. గుండాల రిజర్వాయర్ ఊసే ఎత్తడం లేదు. ఏడాదిగా మోసం చేస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేం పాలన అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.


డోన్: ఇచ్చిన హామీలను విస్మరించడంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు నారా లోకేష్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. యువగళం పాదయాత్రతో నారా లోకేష్ 2023 ఏప్రిల్ 14వ తేదీన ప్యాపిలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా డోన్ మండలం గుండాల చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో రిజర్వాయర్‌ను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అదే ఏడాది జలదుర్గంలో జరిగిన బహిరంగ సభలో ఆయన తండ్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే జలదుర్గాన్ని మండల కేంద్రంగా ప్రకటిస్తానని హామీనిచ్చారు. ఏడాదిన్నర గడిచినా ఈ హామీల ఊసెత్తకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వాయర్ ఏర్పాటు నీటి మీద రాతలే!

యాపదిన్నె, వెంకటాపురం, జగదుర్తి తదితర ప్రధాన చెరువులకు వర్షపునీరు చేరవేసే అత్యంత పెద్దదైన వంకపై గుండాల వద్ద రిజర్వాయర్ నిర్మిస్తామని టీడీపీ నేతగా నారా లోకేష్ హామీనిచ్చి ఏడాదిన్నర అయ్యింది. ప్యాపిలి పట్టణంలోని బీసీ కాలనీకి యువగళం పాదయాత్ర చేరుకున్న సందర్భంగా రిజర్వాయర్ నిర్మిస్తాననే పైలాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. ఇప్పటికీ ఈ వంకపై పలు గ్రామాల వద్ద నీటి నిల్వల కోసం ఆర్‌డీటీ పలు చెక్ డ్యామ్‌లను నిర్మించింది. అతిపెద్ద రిజర్వాయర్ ప్రభుత్వం నిర్మిస్తే భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి డోన్, ప్యాపిలి మండలాల్లో సాగునీటి విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే అధికారంలోకి వచ్చి నారా లోకేష్ మంత్రి అయ్యారు. ప్రజలకు ఇచ్చిన హామీ మాత్రం ఇప్పటి వరకు అమలు కాలేదు. రిజర్వాయర్ ఏర్పాటు నీటి మీద రాతగానే మారింది.



2023 ఏప్రిల్ 14న ప్యాపిలి బీసీ కాలనీలో పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న నారా లోకేష్



డోన్ మండలం ఎస్.గుండాల వద్ద రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రాంతం



జలదుర్గాన్ని మండల కేంద్రంగా చేస్తానని హామీనిస్తున్న చంద్రబాబు(ఫైల్)

జలదుర్గం మండల కేంద్రంగా ఎప్పుడు?

ప్యాపిలి మండలంలో జలదుర్గాన్ని మరో మండలంగా ఏర్పాటు చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీ ఒట్టిదేనని తేలిపోయింది. సుమారు 10వేల గ్రామ జనాభా, 25 గ్రామాలకు అనుకూలంగా ఉన్న జలదుర్గాన్ని మండల కేంద్రంగా ఎప్పుడు ఏర్పాటు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి చిన్న విషయానికి 20 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్యాపిలికి వెళ్లాల్సి వస్తోందని కొండమీది గ్రామాలైన బూరుగల, బోంచెరువుపల్లె, సీతమ్మతండా, రాచెర్ల, అలేబాద్‌తండా, మునిమడుగు, బోంచెరువుపల్లె తండా, కొమ్మేమర్రి, సిద్దనగట్టు, గార్లదిన్నె, ఊటకొండ, హుసేనాపురం, యజ్జరామాపురం, కొలపల్లె గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఐక్యంగా ఉద్యమాలు చేస్తాం



హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టడం, ప్రజల దుస్థితిని మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ నడపటం దారుణం. హంగు, ఆర్భాటాలతో ఆనాడు నిర్వహించిన యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి. లేదంటే ఈ ప్రాంతం ప్రజలు ఐక్యంగా ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుంది.

– జలదుర్గం రసూల్, ఆవాజ్ కమిటీ డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు

చిత్తశుద్ధి లేదు



డోన్ నియోజకవర్గ ప్రాంతంలో భూగర్భ జలాలను పెంపొందించేందుకు అత్యవసరమైన గుండాల రిజర్వాయర్ పనులను వెంటనే చేపట్టాలి. పశ్చిమ ప్రాంత పల్లెలు తిరిగి పచ్చదనంతో వెల్లివిరియాలంటే గుండాల రిజర్వాయర్ అత్యవసరం. హామీ ఇచ్చిన వారికి చిత్తశుద్ధి లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా హామీ నెరవేర్చి మాట నిలుపుకోవాలి.

– మెట్టు వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్

సమంజసం కాదు



యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ఓట్లేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా అయ్యింది. ఇప్పటికైనా ఎన్నికల హామీ మేరకు గుండాల రిజర్వాయర్‌ను నిర్మించి డోన్, ప్యాపిలి రైతులకు సాగు నీరు అందించాలి. లేకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

– ఓబులాపురం సుధాకర్, ఎంపీటీసీ సభ్యుడు, డోన్ మండలం



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రైతుల కోసం రేపు అన్నదాత పోరు

బొమ్మలసత్రం: యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న అన్నదాత పోరు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి నివాసంలో నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియాను అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నలకు ఏ కష్టం రాకుండా అండగా నిలిచారన్నారు. అన్నదాతల సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే అన్నదాత పోరుతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, జిల్లా ఉపాధ్యక్షులు దాల్‌మిల్ అమీర్, మాజీ ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, కౌన్సిలర్లు కృష్ణమోహన్, సాదిక్‌బాషా, చంద్రశేఖర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, మున్సిపల్ వింగ్ అధ్యక్షులు టైలర్ శివయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కారువరి కుమార్, లీగల్‌సెల్ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ హరి, నాయకులు జాకీర్ హుస్సేన్, సుబ్బరాయుడు, సాయిరామ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సుధాకర్, రత్నబాబు చౌదరి పాల్గొన్నారు.

మహానంది ఆలయం మూసివేత



తలుపులు మూసేస్తున్న పండితులు, అర్చకులు

మహానంది: రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు మహానంది ఆలయ తలుపులు మూసేశారు. ముందుగా వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బింబ సంరక్షణార్థం దర్భకూర్చలు, దర్భ పవిత్రములు సమర్పించి ఆలయ తలుపులు మూశారు. ఏఈఓ ఎరమల మధు ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శివశంకరశర్మ, ముఖ్య అర్చకులు పూజలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, పి.సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు. సోమవారం ఉదయం తలుపులు తీసి సంప్రోక్షణ పూజలు నిర్వహించి భక్తులను దర్శన భాగ్యం కల్పిస్తామని అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా అటవీశాఖ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ

కర్నూలు(సెంట్రల్): అటవీశాఖలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన స్క్రీనింగ్ టెస్టు ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు 33 కేంద్రాల్లో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షకు 89.75 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 12,919 మంది అభ్యర్థులకుగాను 10,820 మంది హాజరుకాగా 2,099 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించిన సెక్షన్ ఆఫీసర్ స్క్రీనింగ్ టెస్టు కోసం మూడు కేంద్రాలను ఏర్పాటు చేయగా 81.20 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 2,255 మంది అభ్యర్థులకుగాను 1,831మంది హాజరు కాగా 424 మంది గైర్హాజరయ్యారు. కాగా, ఉదయం శంకరాస్ డిగ్రీ కాలేజీలో జరిగిన స్క్రీనింగ్ టెస్టును ఏపీపీఎస్సీ జిల్లా కోఆర్డినేటర్, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ పరిశీలించి ప్రశాంతంగా జరిగేందుకు అధికారులకు సూచనలు ఇచ్చారు.

బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి



సతీష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బ్రాహ్మణ నేతలు

కర్నూలు(అర్బన్): బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోలూరు సతీష్, ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహర్‌రావు, జిల్లా నాయకులు దుర్గం బాలాజీ కోరారు. వారు ఆదివారం మాట్లాడుతూ.. బ్రాహ్మణులు సాంప్రదాయ వృత్తులు, అర్చకత్వం ఆధారంగా జీవనం సాగిస్తున్నప్పటికీ, ఆధునికత ఆన్‌లైన్ సేవల విస్తరణతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్రాహ్మణులకు విద్య, ఉపాధి అవకాశాల్లో తగిన మద్దతు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణ సంక్షేమ బోర్డు ద్వారా కొంత మేర చర్యలు తీసుకున్నా, అవి పూర్తి స్థాయిలో సంతృప్తి పరచలేక పోతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాహ్మణుల సంక్షేమం కోసం నిధులు కేటాయించాలన్నారు.

ఉల్లి ధర మరింత పతనం

- కిలోకు లభించిన ధర ఒక్క రూపాయి మాత్రమే!
- కన్నీరు మున్నీరవుతున్న రైతులు
- ఉల్లి రైతుల ఆత్మహత్యాయత్నాలను బోగస్ అనడంపై నిరసన

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధర మరింత పతనం కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ నెల 5న రాత్రి కర్నూలు మార్కెట్‌కు 16,589 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. 6వ తేదీన వ్యాపారులు 7,756 క్వింటాళ్ల మాత్రమే కొన్నారు. మిగిలిన 8,842 క్వింటాళ్ల ఉల్లిని ఆదివారం వ్యాపారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. కిలో రూపాయి చొప్పున ధర లభించడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటూ ఇళ్లకు వెనుదిరిగారు. ఎకరా ఉల్లి సాగుకు రూ.లక్షకు పైగా పెట్టుబడి ఖర్చు వస్తోంది. ఎకరాకు కనిష్ఠంగా 30 క్వింటాళ్లు, గరిష్ఠంగా 80 క్వింటాళ్లు దిగుబడి వస్తోంది. క్వింటాలుకు రూ.100 ధర లభిస్తుండటంతో రైతులు ఆత్మహత్యాయత్నాలు చేసుకుంటున్నారు. వ్యాపారులు ఈ నామ్ ద్వారా 7,263 క్వింటాళ్లు కొన్నారు. కనిష్ఠ ధర రూ.100, గరిష్ఠ ధర రూ.619 మాత్రమే. ఉల్లిలో నాణ్యత బాగుంది. రెండు, మూడు రోజులుగా వర్షాలు లేవు. ఎండల తీవ్రత కూడా పెరిగింది. నాణ్యత బాగానే ఉన్నప్పటికీ క్వింటాలు ఉల్లికి రూ.100 ధర ఇవ్వడం కర్నూలు మార్కెట్ యార్డులో కలకలం రేపింది. 1,579 క్వింటాళ్ల ఉల్లిని వ్యాపారులు కొనకుండా చేతులెత్తేశారు. వ్యాపారులు కొనని ఉల్లిని మార్క్‌ఫెడ్ రూ.1,200 ధరతో కొనుగోలు చేసింది.

రైతు ఆత్మహత్యాయత్నాలను బోగస్ అంటారా?

గతంలో ఎన్నడూ లేని విధంగా ఉల్లి ధరలు పడిపోయాయి. పెట్టుబడిలో కనీసం 20 శాతం కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన రైతులు వెంకటనాయుడు, కృష్ణ ఉల్లి సాగు చేసి నష్టాలు మూటగట్టుకున్నారు. అప్పుల బాధలు తట్టుకోలేక పొలంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిని సాక్షాత్తూ ప్రభుత్వమే బోగస్‌గా పేర్కొనడంపై రైతుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. బయట కిలో ఉల్లి రూ.20 నుంచి రూ.25 ప్రకారం విక్రయిస్తున్నారు. మార్కెట్ యార్డులో మాత్రం రైతులు తెచ్చిన ఉల్లి కిలో రూపాయి ప్రకారం కొంటున్నారు. ఇంత అధ్వాన్నంగా ధరలు లభిస్తే రైతులు ఆత్మహత్యలు చేసుకోక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



కర్నూలు మార్కెట్ వద్ద బారులు తీరిన ఉల్లి వాహనాలు

మూన్నాళ్ల ముచ్చట

రూ.1,200 మద్దతు ధరతో ఉల్లి కొనుగోళ్లు చేస్తామని ప్రభుత్వం చేసిన హడావుడి మూడు రోజులకే ముగిసింది. ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజులు మార్కెట్‌కు ఉల్లి గడ్డలు తక్కువగా వచ్చాయి. ఈ రోజుల్లో వచ్చిన ఉల్లి మొత్తాన్ని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. ఈనెల 6న మార్కెట్‌కు ఉల్లిగడ్డలు పోటెత్తడంతో కొనుగోలులో ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో మద్దతు కొనుగోలు మూన్నాళ్ల ముచ్చటగా మారింది.

గౌరవమేదీ?

- ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం విడుదలలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- 11 నెలలుగా నయా పైసా ఇవ్వని సర్కారు
- నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

ముస్లింలకు మసీదులు అత్యంత పవిత్ర స్థలాలు. అందులో ప్రతి రోజూ ఐదు పూటలా ప్రార్థనలు(నమాజ్) జరుగుతాయి. నమాజ్ చదివించేందుకు ఇమామ్, అజాన్ ఇవ్వటానికి, మసీదు బాగోగులు చూసుకునేందుకు మౌజన్ ఉంటారు. వీరిద్దరికీ ఆ మసీదే జీవనాధారం. అందులో వచ్చే గౌరవ వేతనంతోనే కుటుంబాన్ని పోషించుకుంటారు. అలాంటి వారికి కూటమి ప్రభుత్వం 11 నెలలుగా నయా పైసా విడుదల చేయకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. – నంద్యాల(అర్బన్)

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం గుర్తించిన మసీదులు 398 ఉన్నాయి. వీటిలో 398 మంది ఇమామ్‌లు, 398 మంది మౌజన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇమామ్, మౌజన్ల ఆర్థిక పరిస్థితులను తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ వైఎస్సార్‌సీపీ హయాంలో గౌరవవేతనాన్ని పెంచారు. రూ.5 వేలు ఉన్న ఇమామ్‌ల గౌరవ వేతనాన్ని రూ.10వేలకు, రూ.3వేలు ఉన్న మౌజన్ గౌరవ వేతనాన్ని రూ.5 వేలకు పెంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా అందించి మసీదుల నిర్వహణను సులభతరం చేశారు.



నంద్యాలలో ఉన్న జామియా, జుమ్మా మసీదులు

పదకొండు నెలలుగా ఎదురు చూపులు..

సార్వత్రిక ఎన్నికల సమయంలో ముస్లింలపై చంద్రబాబు హామీల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇమామ్‌లకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు, మౌజన్లకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు గౌవర వేతనాన్ని పెంచుతామని ఊరించి ఓట్లు వేయించుకున్నారు. అధికారం చేపట్టి ఏడాదికి పైగా అయినా ఆ ఊసే లేకపోవడంతో ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గౌవర వేతనం పెంచకపోవడంతోపాటు 11 నెలల నుంచి నెలనెలా ఇచ్చే గౌరవ వేతనం కూడా ఇవ్వకపోవడంతో తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఇమామ్, మౌజన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ



బొమ్మలసత్రం: జిల్లాలో ఉన్న ఇమామ్‌లు, మౌజన్‌లకు ఇచ్చే గౌరవవేతనాల బకాయిలు వెంటనే చెల్లించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఇమామ్, మౌజన్‌లకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం 11 నెలలుగా నిలిపేయడం తగదన్నారు. ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనం విడుదల చేయాలనే డిమాండ్‌తో సోమవారం ఉదయం నంద్యాలలో ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. ఉదయానంద హోటల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు.

తక్షణం విడుదల చేయాలి



ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలు చెల్లించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నెలల తరబడి నిధుల విడుదల చేయకపోతే మసీదుల నిర్వహణ ఎలా సాధ్యం. 11 నెలలుగా వేతనాలు లేక ఇమామ్, మౌజన్‌లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే గౌరవవేతన బకాయిలు విడుదల చేయాలి.

– రసూల్ ఆజాద్, వైఎస్సార్‌సీపీ మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

సచివాలయ ఉద్యోగుల ఉద్యమ బాట

- వలంటీర్ల బాధ్యతలను అప్పగించడంపై ఆందోళన
- ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు



ఆదోని మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు(ఫైల్)

కర్నూలు(అర్బన్): గ్రామ/ వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిభారాన్ని పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. సర్వేల పేరుతో తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు శాంతియుత నిరసన కార్యాక్రమాలకు సచివాలయ ఉద్యోగులు శ్రీకారం చుట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలన్నింటినీ పారదర్శకంగా ప్రజల ముంగిటికే చేర్చిన వలంటీరు వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలోనే గతంలో వలంటీర్లు నిర్వహించిన బాధ్యతలను ప్రస్తుతం గ్రామ / వార్డు సచివాలయ ఉద్యోగులతో చేయించేందుకు నిర్ణయం తీసుకుంది. మనమిత్ర – వాట్సాప్ ఈ గవర్నెన్స్ పేరుతో ఇంటింటికి వెళ్లి యాప్‌లో ఉన్న పౌర సేవలను ఇళ్ల యజమానులకు వివరించి వారిని భాగస్వామ్యులను చేయాలనే చర్యలను చేపట్టింది. ఇందుకు గ్రామ/ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వినియోగించుకునేందుకు ఆదేశాలను జారీ చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 50 ఇళ్లకు ఒక వలంటీరును నియమించి క్లస్టర్‌గా విభజించి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు నాలుగైదు క్లస్టర్ల బాధ్యతలను ఒక సచివాలయ ఉద్యోగికి కేటాయించి సమాచార సేకరణ, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. మనమిత్ర వాట్సాప్ లోని మొత్తం 709 సర్వీసుల్లో ప్రతి ఉద్యోగి ఒక్క సర్వీస్ అయినా ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా 'మనమిత్ర' సర్వే వల్ల తమ ఆత్మగౌరవం దెబ్బ తింటుందని సచివాలయ ఉద్యోగులు ఉద్యమ బావుటా ఎగుర వేసేందుకు సిద్ధం అయ్యారు.

సచివాలయ ఉద్యోగులు చేస్తున్న సర్వేలు ..

గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగులు రెగ్యులర్‌గా తమ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న విధులతో పాటు అనేక రకాల సర్వేలను ఇళ్ల వద్దకు వెళ్లి నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కౌశలం, బయోమెట్రిక్ అప్‌డేషన్, సిటిజన్ ఈకేవైసీ, పాపులేషన్ మేనేజ్‌మెంట్, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, చైల్డ్ ఆధార్, ఫ్యామిటీ డీటైల్స్, మొబైల్ నెంబర్ అప్‌డేట్, ఫ్యామిలీ మైగ్రేషన్, అదర్ డిపార్టుమెంట్ ఈకేవైసీ, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన మిత్ర, నాన్ ఏపీ రెసిడెంట్ తదితర సర్వేలను ఇంటింటికి తిరిగి చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం మనమిత్ర వాట్సాప్ సర్వేను కూడా ఖచ్చితంగా చేయించాలని ఆదేశాలు జారీ చేయడం పట్ల సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురై ఉద్యమ బాట పడుతున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి బలవంతంగా సర్వీసులను నమోదు చేయాలనే ఆదేశాల వల్ల ఉద్యోగులు అనేక రూపాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల తమ ఆత్మ గౌరవం దెబ్బ తినే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తప్పని పరిస్థితుల్లో విధులు బహిష్కరించేందుకు కూడా వెనుకాడమని వారు హెచ్చరిస్తున్నారు.

ఉద్యమానికి శ్రీకారం

సచివాలయ ఉద్యోగులను మానసికంగా ఇబ్బంది పెట్టే కార్యక్రమానికి ప్రభుత్వం పూనుకున్న నేపథ్యంలోనే ఉద్యోగులు ఈ నెల 6వ తేదినే ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని ఉద్యోగులు ముందుగా నల్లబాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అలాగే తమ పరిధిలోని ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు ఇచ్చారు. తమ ఆవేదన పట్ల ప్రభుత్వం స్పందించకపోతే ఏపీవీడబ్ల్యూఎస్‌ఈ జేఏసీ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్ దుర్మరణం


వడ్ల మాబు ఉస్సేన్ (ఫైల్)

సంజామల: కోవెలకుంట్ల–జమ్మలమడుగు ప్రధాన రహదారిలో ఆటోను లారీ ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..అక్కంపల్లె గ్రామానికి చెందిన వడ్ల కలీల్ బాషా, ఉస్సేన్‌బీ కుమారుడు వడ్ల మాబు ఉస్సేన్(25) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అక్కంపల్లె గ్రామం నుంచి జమ్మలమడుగుకు ఆటోలో వెళ్తుండగా నొస్సం సమీపంలో ఎదురుగా వేగంగా వస్తున్న సిమెంట్ లారీ అదుపు తప్పి ఢీకొంది. ఆటో డ్రైవర్ మాబు ఉస్సేన్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారీ అయ్యాడు. మృతునికి భార్య సబియా బేగం, కమార్తె ఉన్నారు. మృతదేహన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు రిజర్వాయర్‌లో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం కనిపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రిజర్వాయర్ వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. ఎగువ నుంచి రిజర్వాయర్‌లోకి వరద నీరు వస్తుండటంతో మృతదేహం కొట్టుకొచ్చినట్లు పోలీసులు భావిస్తున్నారు. గ్రామ పంచాయితీ అధికారులతో పంచనామా చేసి మృతదేహాన్ని అక్కడే పూడ్చిపెట్టారు.

నల్లమల ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- ఒకరికి గాయాలు...ట్రాఫిక్ జామ్

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు, బైక్ ఆదివారం ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఘాట్ రోడ్డులోని సర్వ నరసింహస్వామి ఆలయం సమీపంలో నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, నంద్యాలకు వస్తున్న పెద్దకొట్టాలకు చెందిన వెంకటేష్ బైకు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో వెంకటేష్‌కు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంతో ఘాట్ రోడ్డులో వాహనాలు నిలిచి పోయాయి. మహానంది పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేయడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.

ఫిజియోథెరపీ...అంతా హ్యాపీ!

- నొప్పుల నుంచి ఉపశమనం
- పలు వ్యాధులకు మెరుగైన వైద్యం
- ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత థెరపీ చికిత్స
- ప్రైవేటులో పెరిగిన వైద్యులు
- నేడు వరల్డ్ ఫిజియోథెరపీ డే

డాక్టర్ ఆపరేషన్ చేసినా...ఆ తర్వాత మళ్లీ సాధారణ జీవితం గడపాలంటే మాత్రం ఫిజియోథెరపీ కొంత కాలం చేయించుకోకతప్పదు. పలు రకాల రుగ్మతలు, నొప్పులు, ఇబ్బందుల నుంచి ఇది ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. కొన్ని జబ్బులకు ఫిజియోథెరపీ కేంద్రాలకు వెళ్లి అక్కడి పరికరాలతో చికిత్స చేయించుకోవాల్సి రాగా, మరికొన్ని అక్కడి వైద్యుల సలహాతో ఇంటి వద్దే వ్యాయామాలు చేసుకునే అవకాశం ఉంటుంది. వారు చెప్పిన ప్రకారం ప్రతిరోజూ ఆచరిస్తే సమస్య పరిష్కారమవుతుంది. నేడు వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా ప్రత్యేక కథనం.


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఫిజియోథెరపీ కేంద్రం

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ప్రస్తుతం 1200 మందికి పైగా ఫిజియోథెరపిస్ట్‌లు ఉన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనూ ఉచితంగా ఫిజియోథెరపీ చికిత్స అందిస్తున్నారు. ఇక్కడికి అవసరమైన పరికరాలను గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం సమకూర్చడంతో దాదాపుగా అన్ని సమస్యలకు ఇక్కడ చికిత్స లభిస్తోంది. ఇక్కడికి ఆర్థోపెడిక్, న్యూరాలజి, న్యూరోసర్జరీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, కార్డియాలజి తదితర విభాగాల నుంచి రోగులు ఫిజియోథెరపీ చికిత్స కోసం వస్తుంటారు. ఈ కేంద్రానికి రాలేని, బెడ్‌పైనే ఉన్న రోగులకు మాత్రమే ఫిజియోథెరపిస్టులే వెళ్లి చికిత్స అందిస్తుంటారు. ఇందులో టెన్స్, ఇంటర్ ఫెరిన్షియల్ థెరపి, అల్ట్రాసోనిక్ థెరపి, ఎలక్ట్రికల్ స్టిమిలేటర్, షార్ట్‌వేవ్ డయాటర్మి, సీపీఎం డివైస్, లేజర్, ట్రెడ్‌మిల్, బైసైకిల్ అర్గోమీటర్, క్వార్డిసెట్స్ టేబుల్, పారలల్ బార్, షోల్డర్ వీల్, స్విస్ బాల్స్‌తో పాటు పలు వ్యాయామ పరికరాలున్నాయి. కర్నూలుతో పాటు నంద్యాల జిల్లా ఆసుపత్రిలో, ఆదోని ఏరియా ఆసుపత్రిలో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఫిజియోథెరపిస్టులు రోగులకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు.

శరీర కదలికలు సాధారణ స్థితికి

ఏదైనా కారణం, ప్రమాదం వల్ల గాయం, వైకల్యం ఏర్పడితే శరీర భాగాల కదలిక ఇబ్బందిగా మారుతుంది. ఇలాంటి వారి శరీర భాగాల కదలికను సాధారణస్థితికి తెచ్చేందుకు ఫిజియోథెరపీ వైద్యం ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా పక్షవాతం, మెడనొప్పి, నడుమునొప్పి, మోకాళ్ల నొప్పి, భుజంనొప్పి, వెన్ను సమస్యలు శస్త్రచికిత్సకు ముందు తర్వాత వాటి పనితీరును పునరుద్ధరించడానికి రిహాబిలిటేషన్ ఉపయోగపడుతుంది. నరాల బలహీనతలు, పనిచేసే చోట వచ్చే సమస్యలను అధిగమించేందుకు ఫిజియోథెరపీ ఎంతగానో దోహదపడుతుంది.

ఫిజియోథెరపీతో అందే వైద్యం

ఫిజియోథెరపీ చికిత్సలో భాగంగా 8 అంకెపై నడవడం, రెండు సరళ రేఖల మధ్య నడిపించి చికిత్స చేస్తారు. దీనివల్ల కీళ్లు బిగుతుగా మారకుండా కదలిక య థావిధిగా ఉండేలా కండరాలు బిగుతుగా మారకుండా, క్షీణించకుండా, రక్తప్రసరణ యథావిధిగా జరిగేలా ఉంటాయి. మంచంపై ఒకే స్థితిలో పడు కోకుండా అత్యధిక ఒత్తిడి కలిగిన ప్రాంతాలపై పుండ్లు/అల్సర్‌లు పెరగకుండా ఉండేందుకు పొజిషన్ చేంజింగ్, బెడ్ రోలింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తారు. ఇవే గాక వెయిట్ బేరింగ్ ఎక్సర్‌సైజ్‌లు, న్యూరో డెవలప్‌మెంట్ ట్రైనింగ్, కోఆర్డినేషన్ ఎక్సర్‌సైజ్‌లు, చేతి కి సంబంధించిన ఎక్సర్‌సైజ్‌లను ఫిజియోథెరపిస్ట్‌లు అందిస్తున్నారు.



నొప్పుల నుంచి ఎంతో ఉపశమనం

ఫిజియోథెరపి వైద్యం ద్వారా దీర్ఘకాలిక సమస్యలైన స్పాండిలైటిస్, ఫ్రోజెన్ షోల్డర్, టెన్నిస్ ఎల్బో తదితర ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇటీవల కాలంలో యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఫోన్లు, కంప్యూటర్లు వాడకంతో భుజాలు, మెడ, నడుము నొప్పులతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి ఫిజియోథెరపీ వైద్యం ద్వారా ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేకుండా ఉపశమనం కలిగిస్తున్నారు. గర్భిణులు తెలిసి తెలియకుండా వాడే కొన్ని మందులతో సైడ్ ఎఫెక్ట్స్ వస్తుంటాయి. వారికి జన్మించే పిల్లలు జన్యులోపంతో బాధపడుతున్నారు. గర్భం దాల్చిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి వ్యాయామం చేయాలి అనే దానిపై ఫిజియోథెరపిస్ట్ వైద్యులను సంప్రదించడం ఉత్తమం. ఫిజియోథెరపీ ద్వారా తల్లి కడుపులో పెరిగే బిడ్డతో మొదలు వయోవృద్ధుల వరకు ఎన్నో జబ్బులను తగ్గించవచ్చు.

ఫిజియోథెరపిస్ట్ సూచనలు పాటించాలి



కొన్ని రకాల ఆపరేషన్ల అనంతరం ఫిజియోథెరపీ కీలకం అవుతుంది. ఆపరేషన్ తర్వాత వ్యాయామం లేకపోతే కండరాల్లో ఫైబ్రోసిస్ అభివృద్ధి చెంది వంకర్లు పోతాయి. ఎక్కువరోజులు మంచంపై ఉంటే కాళ్లలో రక్తం గడ్డకట్టి ఎంబాలిజం వచ్చి గుండె, మెదడుకు స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. ఆపరేషన్‌తో పాటు రోగి సాధ్యమైనంత తొందరగా మామూలు స్థితికి రావాలంటే ఫిజియోథెరపీ చాలా ప్రధానం. ఇటీవల కాలంలో బైపాస్ సర్జరీ చేయించుకున్న వారికి కూడా ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. పెద్ద పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో రోగులకు ఫిజియోథెరపీ ఒక భాగం చేశారు. ఈ నేపథ్యంలో ఫిజియోథెరపిస్ట్ అందించే సూచనలు పాటించాల్సి ఉంటుంది.

–డాక్టర్ హనీఫ్, ఫిజియోథెరపిస్ట్, కర్నూలు

శారీరక చురుకుదనం ముఖ్యం



ప్రస్తుత కాలంలో మనుషుల్లో శారీరక చురుకుదనం తక్కువై పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. యువత నుంచి వృద్ధుల వరకు చాలా మంది భుజం, మెడ, మోకాలు నొప్పి వంటి సమస్యలతో వస్తున్నారు. కండరాల బలహీనతలతో కూడిన నొప్పులను కేవలం మందులతో తాత్కాలికంగా తగ్గించవచ్చు గానీ మళ్లీ మళ్లీ రాకుండా ఉండాలంటే ఫిజియోథెరపీ చేయించుకోవాల్సి ఉంటుంది. నొప్పి ఉన్న ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించి అవసరమైన శారీరక వ్యాయామాలతో పాటు సహాయక చికిత్సను సైతం అందిస్తారు. దీంతో పాటు ప్రతిరోజూ క్రమం తప్పక వ్యాయామం, నడక చేయాలి.

–డాక్టర్ అర్షద్ అయూబ్, ఫిజియోథెరపిస్ట్, కర్నూలు

9న జిల్లాస్థాయి సెపక్‌తక్రా పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 9 వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో సెపక్‌తక్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి జి. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 14 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపిక అయిన క్రీడాకారులు ఈనెల 13, 14 తేదీల్లో లఅనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో (సబ్ జూనియర్స్ విభాగం) పాల్గొంటారని తెలిపారు. అలాగే ఈనెల 27, 28 తేదీల్లో ఒంగోలు పట్టణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు వెంట తీసుకు రావాలని తెలిపారు. వివరాలకు 94402–57242 సెల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విష జ్వరాలపై కదిలిన యంత్రాంగం


కోవెలకుంట్ల సీహెచ్‌సీలో జ్వర పీడితుల వార్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్

కోవెలకుంట్ల: విష జ్వరాలపై అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం లోపించి దోమల కారణంగా ప్రజలు విష జ్వరాలు బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విషయాన్ని 'డెంగీ లక్షణాలతో ఆసుపత్రుల్లో చికిత్స' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ పవనకుమార్‌రెడ్డి సోమవారం పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చేరుకుని చికిత్స పొందుతున్న జ్వరపీడితులను పరామర్శించారు. సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెంగీ లక్షణాలతోపాటు వైరల్ ఫీవర్స్‌తో బాధపడుతున్న మహిళలు, చిన్నారులకు సకాలంలో వైద్య సేవలందిస్తున్నట్లు తహసీల్దార్‌కు డాక్టర్ వివరించారు. మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పట్టణ శివారులోని స్వామినగర్ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్ కెన్నెడి జ్వరాలతో బాధపడుతున్న 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మేజర్ పంచాయతీ ఈఓ ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో స్వామినగర్, ఎల్ఎం కాంపౌండ్, గాంధీనగర్, పూసలవీధి, తదితర ప్రాంతాల్లో దోమలు నివారణకు క్రిమి సంహారక మందు పిచికారీ చేయించారు.


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ'సమ్మేళనం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 52 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. 1973–1974 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులతు ఆదివారం పాఠశాలలో సమావేశమై అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇక్కడ చదువుకుని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యేగా, ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న వై.శివరామిరెడ్డి కూడా సమావేశానికి హాజరయ్యారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం సంతోషంగా ఉందని సీపీఎం నాయకులు రామాంజనేయులు, రెహమాన్ తెలిపారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులు దస్తగిరి, శ్రీనివాసరావు, నాగరాజుతోపాటు ప్రస్తుత పాఠశాల హెచ్ఎం ఫయాజుద్దీన్‌ను సన్మానించారు.

టీడీపీ నాయకులు బేస్ మట్టాలు కూల్చివేస్తున్నారు


బేస్ మట్టం కూల్చిన దృశ్యం


పట్టాలు చూపుతున్న బాధితులు

డోన్ టౌన్: ఇళ్లు నిర్మించుకుంటున్న క్రమంలో టీడీపీ నాయకులు ఇళ్ల బేస్ మట్టాలను కూల్చేసి ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. పట్టణ సమీపంలోని మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న కోట్ల హరిసర్వోత్తమ రెడ్డి కాలనీలో ఉన్న 510 సర్వే నంబరులో 2007లో అప్పటి ప్రభుత్వం 120 మంది పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసింది. కొందరు ఇళ్ల నిర్మాణాలను చేపట్టగా మరికొందరు ఆర్థిక స్తోమత లేకపోవడంతో బేసమట్టం వరకు నిర్మించుకుని మధ్యలో నిలిపేసుకున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు టీడీపీ నాయకులు వాటిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని బాధితులు రమిజాబీ, మహబూబ్‌సాహెబ్, బాబులాల్, సుధాకర్ తదితర బాధితులు ఆదివారం ఆరోపించారు. కబ్జాదారులు తమ అర్ధరాత్రి ఇళ్ల వద్దకు వచ్చి భయ బ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఐరన్‌బండలో ఇరువర్గాల ఘర్షణ

- కళ్లలో కారం చల్లి రాళ్లు, కట్టెలతో దాడులు
- ఇరువర్గాలకు చెందిన 14 మందికి రక్తగాయాలు
- 30 మందిపై కేసు నమోదు

గోనెగండ్ల: మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో శనివారం రాత్రి ఇరువర్గాల ఘర్షణలో 14 మందికి రక్తగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఐరన్‌బండ గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినిని అదే గ్రామానికి చెందిన బోయ నాగేష్ కొంతకాలంగా వెంటపడి వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న విద్యార్థిని తండ్రి.. బోయ నాగేష్‌ను శనివారం ఉదయం మందలించాడు. దీన్ని మనసులో పెట్టుకున్న నాగేష్ శనివారం రాత్రి తన కుటుంబ సభ్యులు, వర్గీయులతో బాలిక కుటుంబ సభ్యులతో ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో రెండు వర్గాల వారు కళ్లల్లో కారం చల్లుతూ కట్టెలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో బాలిక వర్గానికి చెందిన గొల్ల మునెప్పతో పాటు హనుమంతు, చిన్న పెద్దయ్య, పెద్ద పెద్దయ్య, నాగరాజు, రాముడు, రామయ్యలకు, మరో వర్గానికి చెందిన బోయ నాగేష్‌తో పాటు బోయ పాండు రంగడు, శివమ్మ, నాగేంద్ర, నాగార్జున, చిన్న రంగస్వామి, లక్ష్మన్నలకు రక్త గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గొల్ల మునెప్ప ఫిర్యాదు మేరకు బోయ నాగేష్‌తో పాటు మరో 15 మందిపైనా, బోయ నాగేష్ ఫిర్యాదు మేరకు గొల్ల మునెప్పతో పాటు మరో 13 మందిపైనా పోలీసులకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

నేడు వైఎస్ షర్మిల రాక

కర్నూలు(సెంట్రల్): ఉల్లికి గిట్టుబాటు ధర లేక విలవిల్లాడుతున్న ఉల్లి రైతులను పరామర్శించేందుకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సోమవారం కర్నూలు రానున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఆమె రైతులను పరామర్శించి ధైర్యం చెబుతారని, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అద్దె భవనంలో తరగతుల నిర్వహణ

బనగానపల్లె రూరల్: అద్దె ఇంట్లో తరగతులు చెబుతున్న దృశ్యం శనివారం హుస్సేనాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో కనిపించింది. ఈ పాఠశాల గదులు మూడేళ్ల క్రితం కూలిపోయాయి. అప్పటి నుంచి ఈ పాఠశాలను గ్రామంలోని ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.38 లక్షల నిధులతో 2023లో నూతన తరగతి గదుల నిర్మాణం ప్రారంభించింది. తరగతి గదులు ఐదు నెలల క్రితమే నిర్మాణం పూర్తయినా ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభించలేదు. దీంతో తరగతి గదులు అద్దె భవనంలో అసౌకర్యాల నడమ నిర్వహిస్తున్నారు.


అద్దె భవనంలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



బండెనక బండి.. ఉల్లిగడ్డల బండి!

ఈ చిత్రం ఉల్లి రైతుల దీనస్థితికి అద్దం పడుతోంది. మరోవైపు మద్దతు ధర కల్పించలేని కూటమి ప్రభుత్వ తీరును ఎత్తిచూపుతోంది. కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో మార్కెట్ యార్డులో ఉల్లి దిగుబడులు నిండిపోయాయి. లోపలున్న దిగుబడుల విక్రయం తర్వాతే మిగతా రైతుల ఉల్లిని లోపలకు అనుమతిస్తామని గేట్ వద్దే సెక్యూరిటీ గార్డ్స్ నిలిపేయడంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా రైతులు తెచ్చిన ఉల్లి దిగుబడుల వాహనాలు బళ్లారి చౌరస్తా వరకు నిలిచిపోయాయి.

– కర్నూలు (సిటీ)

యూరియా కోసం అవే అవస్థలు

వెలుగోడు: మండలంలో యూరియా పంపిణీలో పరిస్థితులు ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. మూడో రోజు ఆదివారం మండలంలో అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. వెలుగోడులోని మన గ్రోమోరు, అబ్దుల్లాపురం రైతు సేవా కేంద్రం, రేగడగూడురు గ్రామంలోని మన గ్రోమోర్ వద్ద యూరియా పంపిణీ చేశారు. ఒక్కో పాస్ పుస్తకానికి ఒకటి, రెండు బస్తాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా ఇవ్వకపోవడంతో అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



రేగడగూడురులో యూరియా కోసం క్యూలైన్‌లో నిలబడిన రైతులు

అత్యవసర వైద్యానికి 'డ్రోన్' హారన్!

- కర్నూలు ట్రిపుల్‌ఐటీడీఎం రూపొందించిన సరికొత్త వ్యవస్థ
- డ్రోన్ ఆధారిత హెల్త్ కేర్ మానిటరింగ్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టం తయారు
- దేశంలోనే మొదటిసారి వినూత్న వ్యవస్థను ఆవిష్కరించిన ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్లు
- అత్యవసరమైన సమయంలో ఉపయోగంగా సరికొత్త వ్యవస్థ


ట్రిపుల్‌ఐటీడీఎం వారు తయారు చేసిన డ్రోన్

కర్నూలు (సిటీ): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ డీఎం) సాంకేతిక విద్య, పరిశోధనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. దేశంలో ప్రముఖ ట్రిబుల్ ఐటీగా గుర్తింపు పొందింది. సరికొత్త ఆవిష్కరణలతో దూసుకెళ్తోంది. డ్రోన్ టెక్నాలజీతో దేశంలో ఎక్కడా లేని విధంగా కర్నూలు ట్రిపుల్‌ఐటీడీఎంలో నూతన ఆవిష్కరణచేశారు. ఇన్క్యుబేట్ అయిన ట్రిగున్ రోబోటిక్స్ సిస్టమ్ ప్రైవేటు లిమిటెడ్ స్టార్టప్ కింద డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ అనే సరికొత్త వ్యవస్థను రూపొందించారు. ఈ వ్యవస్థ రూపకల్పనలో ట్రిపుల్‌ఐటీ ఈసీఈ ఆచార్యులు డాక్టర్ కృష్ణ నాయక్, డాక్టర్ ఎం. రవికుమార్(మెకానికల్ ఇంజినీరింగ్), రాయలసీమ యూనివర్సిటీకి చెందిన ఖాసిఫా అంజుమ్ కీలక పాత్ర పోషించారు. అనువుకాని స్థలంలో అత్యవసరమైన సమయంలో ఈ విధానంతో సులువుగా వైద్యసేవలు అందించవచ్చు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగిన సమయంలో క్షతగాత్రులను చికిత్స కోసం తరలించే సమయంలో రోడ్లలో డ్రోన్ ద్వారా హారన్ కొడుతూ ట్రాఫిక్ క్లియర్ చేయవచ్చు. డ్రోన్లను ఉపయోగించి రోగుల ఆరోగ్యాన్ని డాక్టర్ పర్యవేక్షించేందుకు చక్కగా ఉపయోపడుతుంది ఈ వ్యవస్థ. ఇది మందులు, వైద్య పరికరాలను సుదూర ప్రాంతాలకు సరఫరా చేయడానికి ఉపయోగపడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించడానికి, కొండల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు మందులు, అత్యవసరమైన సమయంలో రక్తం వంటివి పంపించడానికి ఉపయోగించబడుతుంది. ఈ వ్యవస్థలను భారతదేశంలోనే మొట్ట మొదటిసారి కర్నూలు ట్రిపుల్ ఐటీడీఎం ఆచార్యులు రూపొందించారు. ఈ వ్యవస్థ సుదూర గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలను అందించడంలో కీలకపాత్ర పోషించనున్నాయి. దీని పనితీరుపై ప్రస్తుతం డెమో ఇచ్చారు.

ఉపయోగాలు ఇవీ..

- డ్రోన్‌ను పూర్తిగా ఆటో మేటిక్, మాన్యువల్ క్యాంట్రోల్ మోడ్‌లో నడపవచ్చు.
- డాక్టర్ ఆసుపత్రి నుంచే అంబులెన్స్‌లోని రోగి స్థితిని పర్యవేక్షణ చేసి, సూచనలతో అంబులెన్స్ ఆపరేటర్ రోగికి ఫస్ట్ ఎయిడ్ అందించగలరు.
- రోగిని సరైన ఆసుపత్రికి తక్షణ తరలింపుకు ఈ వ్యవస్థ సాయం చేస్తుంది.
- సుదూర ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాలకు మందులు, రక్తం వంటి ముఖ్యమైన వైద్య సామాగ్రిని డ్రోన్ల ద్వారా వేగంగా చేర్చవచ్చు.
- అత్యవసర పరిస్థితుల్లో, ప్రజల ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి, సహాయాన్ని అందించడానికి డ్రోన్లను ఉపయోగించవచ్చు.
- వైద్య లాజిస్టిక్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి డ్రోన్ ఆధారిత ఆరోగ్య సంరక్షణ అవసరం.
- డ్రోన్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసరమైన సేవలు అందించేందుకు, అంతరాయం కలుగుతుందని ప్రజలకు తెలియజేసేందుకు డప్పు కొట్టేందుకు సైతం చక్కగా ఉపయోగపడుతుంది.